అన్నమయ్య కీర్తనల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: శ్రీసాయిశృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో 'ప్రతినోట అన్నమయ్య పాట'ఆఫ్ లైన్ శిక్షణా తరగతులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధా మూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు, ఆలిండియా రేడియో కళాకారుడు గౌరీభట్ల లక్ష్మణ మూర్తి, నందిని, యామిని అన్నమయ్య కీర్తనల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు. 15 ఏళ్ల వయసు పైబడిన వారికి కీర్తనల్లో శిక్షణ ఉంటుందన్నారు. నామినల్ ఫీజు కట్టి దరఖాస్తు అందజేయాలని కోరారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. కొత్తపేట మోహన్‌నగర్ కమర్షియల్ ట్యాక్స్ కాలనీలోని శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీలో సంప్రదించాలని కోరారు.

ముషీరాబాద్ డిప్యూటీ డీఈవోగా శ్రావణ్‌కుమార్



ముషీరాబాద్: ముషీరాబాద్ విద్యామండలి నూతన డిప్యూటీ డిఈవోగా కె.శ్రావణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు విధులు నిర్వహించిన చిరంజీవి ఇటీవల ఉద్యోగ విరమణ చేపట్టడంతో ఆయన స్థానంలో శ్రావణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో మండల పరిధిలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తామన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో మండల పరిధిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తామన్నారు.

కార్పొరేటర్ పర్యటన

కాచిగూడ: మణియార్‌పట్టి బస్తీలో ప్రజలు తాగునీటి సమస్యతో రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జలమండలి అధికారులు, సిబ్బందితో కలిసి మణియార్‌పట్టి బస్తీలో పర్యటించి ప్రజా సమస్యను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని, లో ప్రెషర్‌తో నీటిసరఫరా ఉంటుందని స్థానికులు తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ జలమండలి అధికారులకు సూచించారు. జలమండలి బర్కత్‌పుర సెక్షన్ ఏఈ భావన, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, బీజేపీ నేతలు రాజేందర్, ఆశీష్, వినోద్, సంతోష్, భీమ్‌రాజ్, రామకృష్ణ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జంధ్యాల గొప్ప దర్శకుడు

చిక్కడపల్లి: సినీ రంగానికి ఎందరో హాస్యనటులను పరిచయం చేసిన జంధ్యాల గొప్ప దర్శకుడని ఎమ్మెల్సీ మాధుసూదనాచారి అన్నారు. మంగళవారం త్యాగరాయ గానసభలో ప్రముఖ హాస్య దర్శకుడు, రచయిత జంధ్యాల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు శంకర్ మేల్కోటే, పోలాప్రగడ జనార్దనారావుకు జంధ్యాల ఆత్మీయ పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత అనూస్ సిస్టర్స్ నిర్వహణలో నిర్వహించిన జంధ్యాల చిత్ర గీతాంజలి అలరించింది. ఈ కార్యక్రమంలో హైమవతి భీమన్న, రమా మేల్కోటే, బద్రీనాథ్, వంశీ రామరాజు, ఎంవీరావు, దైవజ్ఞశర్మ, సురేందర్ , అనురాధ, రేవతి, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బిజ్‌కామ్ -2025' పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: బద్రుకా కళాశాలలో ఫిబ్రవరి 6, 7వ తేదీల్లో నిర్వహించనున్న బిజ్‌కామ్ -2025 పోస్టర్‌ను మంగళవారం కాచిగూడలోని కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, కళాశాల కార్యదర్శి శ్రీ కిషన్ బద్రుకా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జంట నగరాల్లోని అంతర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బిజ్‌కామ్ -2025 పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 'వైఫ్ ఆఫ్' సినిమా దర్శకుడు భాను, నటీనటులు దివ్యశ్రీ, అభినవ్ మణికంఠ, నిఖిల్ తదితరులు హాజరై సందడి చేశారు. విద్యార్థులకు ఫార్మల్, ఇన్‌ఫార్మల్ విభాగాల్లో పోటీలు ఉంటాయని వారు పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ జానకీరామ్, ప్రోగ్రామ్ కన్వీనర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు మరో బ్యాటరీ కారు

లక్డీకాపూల్: నిమ్స్ రోగుల రవాణా ప్రయోజనార్థం కోసం మరో బ్యాటరీ కారు అందుబాటులోకి వచ్చింది. రాజ్యసభ సభ్యులు రవిచంద్ర తన ఎంపీ నిధుల నుంచి సమకూర్చిన ఎలక్ట్రిక్ బగ్గీని మంగళవారం ఆస్పత్రికి అప్పగించారు. అనంతరం నిమ్స్ అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లక్ష్మి భాస్కర్‌తో కలిసి జెండా ఊపి కార్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రాంగణంలో వద్దిరాజు ఎలక్ట్రిక్ బగ్గీని స్వయంగా నడిపారు. తొలుత డీఎంఎస్ లక్ష్మీ భాస్కర్ ఆస్పత్రి తరఫున వద్దిరాజుని శాలువాతో ఘనంగా సత్కరించి మాట్లాడా రు. రవిచంద్ర తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బండి సంజీవ్, యాదా క్రాంతి, బందారి అనిల్, వెంకట్ గౌడ్, శ్రీరామ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి లైట్లు

- అంధకారంలో పలు ప్రాంతాలు
- అంబర్‌పేట నియోజకవర్గంలో 40శాతం వెలగని వీధిలైట్లు
- చీకటి పడగానే రాకపోకలు సాగించడానికి భయాందోళనకు గురవుతున్న ప్రజలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకునే పరిస్థితులు కరువు





అంధకారంలో తిరుమలనగర్

అంబర్‌పేట: బస్తీలు, కాలనీల్లో అంధకారం నెలకొంది. కొంతకాలంగా వీధి లైట్లు పనిచేయాకపోవడంతో చీకటి పడితే ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో 40శాతం వీధి లైట్లు పనిచేయడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహించింది. వీధిలైట్లు లేకపోవడంతో క్షేత్రస్థాయి అధికారులతో పాటు కార్పొరేటర్, ఎమ్మెల్యే వరకు నిత్యం ఫిర్యాదులు పెద్ద ఎత్తున చేస్తున్నారు. దీనిపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవడంలేదు. నియోజకవర్గంలోని తిరుమల నగర్, మారుతీనగర్, పటేల్‌నగర్, జైస్వాల్ గార్డెన్, పోచమ్మ బస్తీ, కాచిగూడ, నల్లకుంట, తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు పని చేయడంలేదు. ఇప్పటికైన అధికారులు చొరవ తీసుకోని వీధిలైట్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

భయందోళనకు గురవుతున్న ప్రజలు...

వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానికులు చీకటి పడగానే రాకపోకలు సాగించడానికి ఆందోళన చెందుతున్నారు. చిన్నారులు, మహిళాలు ప్రధానంగా ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి వీధిలైట్లు పని చేయాకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసిన ఎవరు పట్టించుకోవడంలేదంటూ మండిపడుతున్నారు.

నిస్సహాయంగా ప్రజాప్రతినిధులు...

వీధిలైట్ల సమస్య ప్రధానంగా ప్రజలను వేధిస్తుండటంతో స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర వత్తిడికి గురవుతున్నారు. వీధిలైట్ల సమస్య పరిష్కారానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కావడం లేదు. వీధిలైట్లను నిర్వహిస్తున్న ప్రైవేటు ఏజెన్సీకి ప్రభుత్వం భారీగా డబ్బులు బకాయిపడటంతో సంబంధిత ఏజెన్సీ వీధిలైట్లను మరమ్మతులు చేయడంలేదు. నిర్వహణ సైతం పట్టించుకోకపోవడంతో ప్రజాప్రతినిధులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. సమస్యపై స్థాయిలో ఉండటంతో ప్రజాప్రతినిధులు ఎలా పరిష్కారించాలో తలలు పట్టుకుంటున్నారు. కమిషనర్ స్థాయిలో ఫిర్యాదు చేసిన పరిష్కారం కాకపోవడంతో ప్రజలకు వీధిలైట్ల సమస్యపై సమాధానం చెప్పలేకపోతున్నారు. క్షేత్రస్థాయి జీహెచ్‌ఎంసీ అధికారులు సహితం సమస్య పరిష్కారంపై ఎలాంటి చర్యలు తీసుకునే పరిస్థితి లేదంటున్నారు. ఫిర్యాదులు స్వీకరించడం తప్ప పరిష్కారించే పరిధి తమ పరిధిలో లేదని పరోక్షంగా చెబుతున్నారు.

బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలి



మాట్లాడుతున్న జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్

కాచిగూడ: దేశంలో జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని జాతీయ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీల జనాభా లెక్కలు లేకపోవడంతో బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. మంగళవారం కాచిగూడలోని జాతీయ బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభా గణనలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బీసీల సమగ్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దేశ జనాభాలో బీసీలు 60శాతం ఉండగా కేవలం 27శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని పేర్కొన్నారు. మెట్టు ముత్యాల్‌రావు, కృష్ణ, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భూషణ్ భాస్కర్, సత్యప్రకాష్ సింగ్, రాజేష్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు ప్రకటనలకే పరిమితం



ముషీరాబాద్ నుంచి నల్గొండ బహిరంగ సభకు తరలివెళ్తున్న ముషీరాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండలో నిర్వహించిన మహాధర్నాకు ముషీరాబాద్ నుంచి బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా నెరవేర్చలేదన్నారు. రైతులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్, కవాడిగూడ, భోలక్‌పూర్, గాంధీనగర్, అడిక్‌మెట్, రాంనగర్ డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, శ్యామ్, రాకేష్‌కుమార్, బల్లాశ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, వై.శ్రీనివాస్‌రావు, నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి

నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి

చిక్కడపల్లి: గ్రంథాలయ ఉద్యోగులు, పెన్షన్‌దారులకు ట్రెజరీ వేతనాలు, పించన్‌లను అందించాలని రాష్ట్ర కమిషనర్ల జేఏసీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య ప్రభుత్వాన్ని కోరారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యకార్డులను మంజూరు చేయాలన్నారు. అనంతరం నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్థిక భారం లేని వేతనాలు, ఆరోగ్యకార్డులను ఇచ్చేలా ముఖ్యమంత్రికి విన్నవిస్తామన్నారు. గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కొక్కుల దేవేందర్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నమూనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు



నమూనాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ రూపారెడ్డి

అంబర్‌పేట: విద్యార్థులు ఔత్సాహిక, పారిశ్రామిక వేత్తలుగా మారారు. వినూత్న వ్యాపార నమూనాలను ప్రదర్శించి ఆలోచింపజేశారు. మంగళవారం డీడీ కాలనీలోని అకడమిక్ హైట్స్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన యువ పారిశ్రామికవేత్తల కార్యక్రమాన్ని నిర్వహించి ఆకట్టుకున్నారు. వ్యాపార విధానాలు, ఉత్పత్తులు, వ్యాపార సేవాలు వంటి అంశాలను ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల రిజినల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ రూపరెడ్డి విద్యార్థులను అభినందించారు.

మున్నూరు కాపులను విస్మరిస్తే గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు

కాచిగూడ: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన మున్నూరుకాపులకు సీట్లు కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లను తెలంగాణ మున్నూరుకాపు మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కాచిగూడలోని మున్నూరు కాపు మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల్లో అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులను విస్మరిస్తే ఆయా పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మున్నూరుకాపు మహాసభకు రూ.2కోట్ల పైచీలుకుతో నగరంలోని గన్‌ఫౌండ్రీలో ప్రాపర్టీని కొనుగోలు చేశామన్నారు. ఇది మహాసభ చరిత్రలోనే ప్రధానమైనదని పేర్కొన్నారు. కొంతమంది మున్నూరుకాపు మహాసభ పేరుతో రూ.200లకే జీవితకాల సభ్యత్వం ఇస్తామని ప్రచారం చేసుకుంటున్నారని వారి సభ్యత్వానికి మున్నూరుకాపు మహాసభకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మున్నూరుకాపు బైలా ప్రకారం మే నెలలో రూ.500లతో మహాసభ సభ్యత్వాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. సభ్యత్వ నమోదు అనంతరం మహాసభ ఎన్నికలను నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు మణికొండ రమేష్‌కుమార్, ఏనుగుల మాణిక్ ప్రభు, జోన్నాడ శ్రీకాంత్, లింగెట్టి హనుమంతరావు, కొంతం సురేష్ బాబు, పుంజాల దత్తుమూర్తి, గోపాల రాధాకృష్ణ, ప్యాట రవీందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పద్మశ్రీ అవార్డులు బీజేపీ అవార్డులు కాదు'

లిబర్టీ: పద్మశ్రీ అవార్డులు బీజేపీ అవార్డులు కావని, అవి జాతీయ అవార్డులని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వి.కృష్ణస్వరూప్ అన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందజేస్తుందని ఆయన గుర్తు చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డులను బీజేపీ అవార్డులుగా భావించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. గద్దర్ జీవితాంతం పేద అణగారిన దళిత బహుజనుల కోసం తన ఆటపాటతో స్ఫూర్తిని నింపారని, అలాంటి ప్రజాకవికి పద్మశ్రీ అవా ర్డు ఇవ్వకపోవడం కేంద్ర ప్రభుత్వ మనువాద, అవకాశవాద సిద్ధాంతానికి నిదర్శనమన్నారు. అజ్ఞాతంలో ఉండి అనంతరం జనజీవన స్రవంతిలోకి వచ్చి అనేక పాటలు రాసి తన ఆటపాటతో జనచైతన్యం కల్పించిన యుద్ధనౌక గద్దర్‌కు పద్మశ్రీ అవార్డు అర్హత ఉన్న ఎందుకు కేంద్ర ప్రభుత్వం ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు. గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, తెలంగాణ జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ గద్దర్‌ను అవమానించలేదని యావత్తు తెలంగాణ ప్రజలను అవమానించారన్నారు.

కర్పూరి ఠాకూర్ జీవితం ఆదర్శం

పంజగుట్ట: బిహార్‌లోని ఒక మారుమూల గ్రామంలో మంగలి సామాజికవర్గంలో పుట్టి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన కర్పూరి ఠాకూర్‌ను బీసీలు ఆదర్శంగా తీసుకుని రాజ్యాధికారం దిశగా ముందుకుపోవాలని బహుజన్ సమాజ్ పార్టీ ఏపీ కో ఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచంద్రరావు అన్నారు. కులాధిపత్య రాజకీయాల్లో ఆయన అంకిత భావమే ఆయనను ముఖ్యమంత్రి స్థాయికి తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సంగెం సూర్యారావు అధ్యక్షతన కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా ఆయన జీవితచరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూర్ణచంద్రరావు మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలను వెలికితీసినట్లుగా బీసీ మాణిక్యాల చరిత్రను మరింత ప్రచారం చేస్తూ, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యం వంశరాజ్, మోడల శ్రీనివాస్ సాగర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, నరెడ్ల శ్రీనివాసులు, పాల్వాయి శ్రీనివాస్, బ్రహ్మయ్య, సత్యనారాయణ, వనభట్ల సుబ్బయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

లిబర్టీ: దేశం కోసం పాటుపడిన మహనీయులను అడుగుజాడల్లో యువత నడవాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు కోరారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ముందు వరుసలో నిలబడిపోరాడిన యోధులను త్యాగధనులను విస్మరించకూడదని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లాలా లజపతిరాయ్ జయంతి పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో మంగళవారం సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లజపతిరాయ్ బ్రిటిష్ పాలకుల గుండెల్లో నిద్ర పోయాడని గుర్తు చేశారు. తల్లిదండ్రుల నుంచి ప్రేరణ పొంది అంకితభావం, క్రమశిక్షణతో దేశానికి జీవితాంతం పనిచేశారని రాజేశ్వరరావు పేర్కొన్నారు. స్వామి దయానంద్ సరస్వతీ స్ఫూర్తితో జాతీయ భావాలను లజపతిరాయ్ జీర్ణించుకున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాగేందర్, పి.వి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్బే మేరాజ్ ప్రార్థనలు



భోలక్‌పూర్ మసీదు వద్ద పోలీసులు బందోబస్తు



ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముస్లింలు పవిత్రంగా జరుపుకునే షబ్ ఏ మేరాజ్ పండుగ సందర్భంగా మంగళవారం మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లా అనుగ్రహాన్ని పొందిన రోజుగా పాటిస్తూ మసీదులలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముషీరాబాద్‌లో జరిగిన గ్యార్వీ ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ రాంబాబు భోలక్‌పూర్, ముషీరాబాద్‌లోని బడీ మసీదు, బిలాల్ మసీద్, మజీద్‌ఏకో, ఫిర్‌దోజ్, జంజం మసీదుల వద్ద బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, గౌస్, జాఫర్, మహ్మద్ మియా, సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఎండి మోహిన్, జావెద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చి వివాదాలకు ముగింపు పలకాలి



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌రాజ్

ముషీరాబాద్: హెబ్రోన్ చర్చిలో ఇరువర్గాల వివాదాల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో పాటు క్రైస్తవుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, వెంటనే ముగింపు పలకాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజ్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ సంజీవయ్య నగర్‌లో పలు రాజకీయ పార్టీల నేతలు, క్రైస్తవ పెద్దలతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వర్గాల గొడవల్ల వల్ల చర్చి ప్రతిష్ట దెబ్బతింటున్నదని ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వివిధ రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహ్మద్ ఎజాజ్, తెలంగాణ క్రిస్టియన్స్ సంఘం కార్యదర్శి దాస్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రజా సాంస్కృతిక యుద్ధనౌక గద్దర్‌పై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన దిగజారుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ... ప్రజలను చైతన్యం చేస్తూ పాటలు రాసి తన గానంతో ఆకట్టుకున్న గద్దర్‌పై అనుచిత వాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ అజాత శత్రువని అలాంటి వ్యక్తికి పద్మశ్రీ అవార్డు రాకుండా అడ్డుకోవడమే కాకుండా దిగజారుడు మాటలతో గద్దర్ అభిమానులను అవమానించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బండి సంజయ్ దిగజారుడు రాజకీయాలకు తెలంగాణ ప్రజలు సరైన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

ఉచిత కంప్యూటర్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ మిట్టా శ్రీనివాస్

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు, కాచిగూడ సహకారంతో మిట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు మిట్టా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మిట్టా శ్రీనివాస్, మిట్టా స్వతంత్ర కళా తెలిపారు. కాచిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పొందిన 90మంది విద్యార్థులకు మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఐఐటీలో శిక్షణ తరగతుల కోసం ముంబాయి ఐఐటీతో ఎంఓయూ చేసుకున్నామని తెలిపారు. మిట్టా ఫౌండేషన్ ద్వారా నిరుపేద యువతకు ఇస్తున్న ఉచిత శిక్షణ తరగతుల కోసం ప్రముఖ సంఘ సేవకులు తోట రఘునాథరావు ఈ సందర్భంగా రూ.5లక్షలు విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మిట్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వినోద్‌కుమార్, మిట్టా మనోహర్‌రావు, ఎక్కా రాజేందర్, పాండురంగా రావు, తోట రఘునాథ్‌రావు, దడువై రాఘవేందర్, మంద సూర్యప్రకాష్, బొజ్జం సాయిబాబా, శివుడు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



పాఠశాలలో నెలకొన్న సమస్యలను వివరిస్తున్న విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి

ముషీరాబాద్: రెండేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్న ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులు అందుబాటులోకి తీసుకురావాలని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, ముషీరాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగపాక వెంకట్‌లు ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు పాఠశాల భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం, మండల డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. భవన నిర్మాణ పనులు కొన్ని నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వాజీద్ హుస్సేన్, సంగపాక వెంకట్‌లు మాట్లాడుతూ... సమస్యలను ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, రతన్, ఇమ్రాన్, పద్మ, నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



శివం రోడ్డులో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అంబర్‌పేట: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంగళవారం శివం రోడ్డు ఏటీఐ ప్రాంగణంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు సమాచారం మేరకు అంబర్‌పేట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

క్రీడలు శరీర దారుఢ్యానికి దోహదం



బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏబీవీపీ నాయకులు

ముషీరాబాద్: క్రీడలు శరీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు కమల్ సురేష్, విద్యానగర్ జిల్లా కన్వీనర్ హరిప్రసాద్ అన్నారు. ముషీరాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభకనబరిచారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను, స్ఫూర్తిని ప్రదర్శించడానికి ఒక అద్భుతమైన వేదికను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు పులి రేవంత్, సవ్వడి క్రిష్, క్రీడాకారులు పాల్గొన్నారు.